# ప్రజల మేలుకోరే బీఆర్‌ఎస్‌ను ఆదరించండి

- రైతుబంధు రాకుండా చేసిన కాంగ్రెస్
- కోడేరు, పెద్దకొత్తపల్లి ప్రచారంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి హర్షవర్ధన్‌రెడ్డి



ముష్టిపల్లి ప్రచార సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి



పెంట్లవెల్లిలో ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్ శ్రేణుల ర్యాలీ

కోడేరు/ పెద్దకొత్తపల్లి, నవంబర్ 28: ప్రజల మేలుకోరే పార్టీ.. కారు గుర్తుపార్టీని ప్రజలు ఆశీర్వదించాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి కోరారు. కోడేరు, ఎత్తం గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి పొరపాటున ఓటు వేస్తే తెలంగాణలో సంక్షేమ పథకాలు నిలిచిపోతాయన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతుబంధు పథకంపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంతో రైతుల ఖాతాలో డబ్బులు వేయడం నిలిచిపోయిందన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గాన్ని 19ఏండ్లు పాలించిన మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు కోడేరుకు డబుల్ రోడ్డు మంజూరైతే పనులు చేయనీయకుండా అడ్డుపుల్ల వేశారన్నారు. ఎత్తం గ్రామానికి కల్వకోలు నుంచి బీటీ రోడ్డు మంజూరైతే అడ్డుకున్నారని అన్నారు. కోడేరు బస్టాండ్ ప్రాంగణాన్ని బాగు చేయించినది బీరం అని గుర్తుంచుకొని, ఆదరించాలని అన్నారు. పొరపాటున కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కరెంటు రాదు, నీళ్లు రావు, నిధులు రావు, రైతుబంధు, రైతుబీమా ప్రజా సంక్షేమ పథకాలు నిలిచిపోతాయన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు దూరెడ్డి రఘువర్ధన్‌రెడ్డి, విండో చైర్మన్ చిన్నారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్‌నాయక్, తాలూకా నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి, సీనియర్ నాయకులు బద్దుల శేఖర్‌యాదవ్, ఎల్లారెడ్డి, మాజీ సర్పంచులు బంగారయ్య, స్వామి, సర్పంచ్ వెంకటస్వామి, ఎంపీటీసీ నరసింహ, గ్రామ అధ్యక్ష కార్యదర్శులు శ్రీశైలం, వెంకటస్వామి, మిద్దె కృష్ణయ్య పాల్గొన్నారు.

## ఆశీర్వదిస్తే.. మరింత అభివృద్ధి చేస్తా

ఎన్నికల్లో ఓటు వేసి మరోసారి ఆశీర్వదించండి.. పెద్దకొత్తపల్లి మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ముష్టిపల్లి, పెద్దకొత్తపల్లి , పెద్ద కార్పాములలో బీరం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దకొత్తపల్లి మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని ఎన్నికల్లో అత్యధిక మెజార్టీని అందించాలని కోరారు. సీఎం కేసీఆర్ పేదల సంక్షేమం కొరకు పథకాలను ప్రవేశపెట్టి అందించాలని ఆయన గుర్తు చేశారు గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులకు కరెంటు కష్టాలు కళ్లారా చూశారన్నారు. పెద్దకొత్తపల్లి మండలంలోని చాలా గ్రామాలకు సాగునీరు రాక పంటలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, నేడు రైతులకు సాగునీరు అందించేందుకు బాచారం హై లెవెల్ కెనాల్ పనులను మంత్రి నిరంజన్‌రెడ్డిచేత శంకుస్థాపన చేశానని తెలిపారు. ఇన్ని పనులు చేశానని, మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు గణేశ్‌రావు, సింగిల్ విండో చైర్మన్ రాజాగౌడ్, మాజీ సర్పంచ్ నరసింహ, రైతు సమితి మండల అధ్యక్షుడు నాగరాజు, సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి ఎంపీటీసీ రేణుక నాగరాజు ఉన్నారు.

## పెంట్లవెల్లి.. గులాబీమయం

పెంట్లవెల్లి, నవంబర్ 28: గత ఎన్నికల్లో కొల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఇచ్చిన మాట ప్రకారం సీఎం కేసీఆర్ సహకారంతో చేసిన అభివృద్ధి మన కండ్ల ముందే ఉంది..మరోమారు కారు గుర్తుకు ఓటేసి, వేయించి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బీరం హర్షవర్ధన్‌రెడ్డిని ఆశీర్వదించాలని బీఆర్‌ఎస్ రాష్ట నాయకుడు రంగినేని అభిలాష్‌రావు, కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సతీమణి బీరం విజయమ్మ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వీరు మాట్లాడుతూ.. గతంలో చౌటచెరువు కట్టపై రాకపోకలు సాగించే వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారన్నారు. ఎందరో ప్రాణాలు పోగొట్టుకున్నా.. అధికారంలో ఉన్న జూపల్లి కృష్ణారావు పట్టించుకోలేదన్నారు. బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన అతితక్కువ కాలంలో చెరువుకట్టను వెడల్పు చేసేందుకు సీఎం కేసీఆర్ సహకారంతో రూ.10 కోట్లు మంజూరు చేయించారని, పనులను ప్రారంభించి 80శాతం పూర్తి చేశారని అన్నారు. చిన్నపాటి వర్షం వస్తే నదితీర గ్రామాలైన మల్లేశ్వరం, వెంకల్, ఎంగంపల్లితండా సమీపంలోని వాగుపై రాకపోకలు ప్రమాదకరంగా ఉండేవన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన బీరం, ఇచ్చిన మాట ప్రకారం సీఎం కేసీఆర్ సహకారంతో పంచాయతీరాజ్‌శాఖ నిధుల నుంచి రూ.9.65లక్షలను మంజూరు చేయించి చెక్‌డ్యాంతో పాటు హైలెవల్ వంతెనను తక్కువ సమయంలో నిర్మించి ఈమధ్య కాలంలో ప్రారంభోత్సవం చేశారన్నారు. అలాగే మల్లేశ్వరం, వేంకల్, ఎంగంపల్లి తండాల బీడు భూములకు సాగునీరందించేందుకు సీఎం కేసీఆర్ సహకారంతో రూ.33కోట్లతో మినీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను నిర్మించేందుకు నిధులను మంజూరు చేయించి జీవో కాపీతో శంకుస్థాపన చేశారని అన్నారు. 19ఏండ్లు ఎమ్మెల్యే, మంత్రిగా ఉన్న జూపల్లి కృష్ణారావు నియోజకవర్గాన్ని పట్టించుకోలేదన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టించిన బీరం హర్షవర్ధన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు. దీంతో పెంట్లవెల్లి గులాబీమయంగా మారింది. కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రాజేశ్, సురేందర్‌గౌడ్, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పోతుల వేంకటేశ్వర్లు, బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గోవురాజు, జిల్లా కోఆప్షన్ సభ్యులు మతీన్, మంచాలకట్ట సర్పంచ్ విజయ్, పెంట్లవెల్లి మాజీసర్పంచ్ వీరయ్య, మండల కోఆప్షన్ సభ్యులు హుసేన్, కొల్లాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రామకృష్ణ,రఫీ, నాయకులు శేషేంద్రప్రసాద్, బత్తిని రాము, రాజు, రామకృష్ణ, పల్లె నాగరాజు., సుమన్ గౌడ్, యాగౌస్, విష్ణుగౌడ్ ఉన్నారు.

## అభివృద్ధి చేసిన బీరాన్ని ఆశీర్వదించండి

- బీరం విజయమ్మ

పెద్దకొత్తపల్లి, నవంబర్ 28: మండలంలోని నక్కలపల్లి, ఆదిరాల, జొన్నల బొగుడలో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి గెలుపు కోసం ఆయన సతీమణి విజయమ్మ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో బీరం విజయమ్మకు ఘన స్వాగతం పలికి దేవాలయాల్లో ఎమ్మెల్యే బీరం గెలవాలని పూజలు చేశారు. జొన్నల బొగుడలో మహిళలు గజమాలతో స్వాగతం పలికారు. గిరిజన మహిళలు తమ వేషధారణతో ఆమెను సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పెద్దకొత్తపల్లి మండలాన్ని అన్నిరంగాల్లో ఎమ్మెల్యే బీరం అభివృద్ధి చేశారన్నారు. ఎమ్మెల్యే బీరాన్ని అత్యధిక మెజార్టీతో కోరారు. కార్యక్రమంలో సర్పంచులు ఇందిరారవినాయక్, రాధిక సుగుణకుమార్‌రెడ్డి ఉన్నారు.

## గులాబీ శ్రేణుల ప్రచారం ముమ్మరం



వీపనగండ్లలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

వీపనగండ్ల, నవంబర్ 28: మండలాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న బీరం హర్షవర్ధన్‌రెడ్డి విజయం ఖాయమని, కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీ అందించాలని టీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు ముంత మల్లయ్య, ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి కోరారు. మండల కేంద్రంలో మంగళవారం ఎన్నికల ప్రచారం అనంతరం బస్టాండ్ ఆవరణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కేసీఆర్ పాలనలో చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికంగా బీరం హర్షవర్ధన్ రెడ్డి చేపట్టిన అభివృద్ధిని చూసి ప్రతి ఒక్కరూ ఓటు వేసి భారీ మెజార్టీని అందించాలని కోరారు. అదేవిధంగా ఎన్నికల ప్రచారం చివరి రోజు కావడంతో ప్రతి గ్రామంలో బీఆర్‌ఎస్ శ్రేణులు ముమ్మరంగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

## ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

కొల్లాపూర్/వీపనగండ్ల, నవంబర్ 28: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ విధుల నిమిత్తం కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి 700మంది కేంద్ర పోలీసు బలగాలు దిగాయి. అయితే కొల్లాపూర్ పట్టణంలో స్థానిక ఎస్సై బీవీ రమణ, పెంట్లవెల్లి ఎస్సై సురేశ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీస్ బలగాలు మంగళవారం రాత్రి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా, ఓటర్లు భయపడకుండా యథేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ముందస్తుగా పోలీసు అధికారులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.

**వీపనగండ్ల..**

మండలంలోని తూంకుంటలో కేంద్ర సాయుధ బలగాలు, స్థానిక పోలీసులతో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు ఎస్సై రవిప్రకాశ్ తెలిపారు. ప్రతి ఓటరు అధైర్యపడకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఎన్నికల కేంద్రాల్లో కేంద్ర బలగాలు కీలక పాత్రను పోషిస్తాయని, ప్రతి గ్రామంలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కోరారు.



కొల్లాపూర్‌లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న కేంద్ర పోలీస్ బలగాలు

## బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమ ప్రభుత్వం



మాధవరావుపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

పాన్‌గల్, నవంబర్ 28: అన్నివర్గాల సంక్షేమ ప్రభుత్వం బీఆర్‌ఎస్ ప్రభుత్వమని ఎంపీటీసీ ఫోరం జిల్లా అధ్యక్షుడు సుబ్బయ్య యాదవ్, జిల్లా మత్స్యకార సంఘం డైరెక్టర్ సెంది శేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని మాధవ రావుపల్లి, శాగాపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుతీరు, ఎన్నికల నేపథ్యంలో సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన ఎన్నికల మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. అనతికాలంలో కొల్లాపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డిని ఆశీర్వదించి మరోసారి గెలిపించాలని కోరారు. కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. అదేవిధంగా మండల కేంద్రంతో పాటు కేతేపల్లి, అన్నారం, రేమద్దుల, బండపల్లి, బుసిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో బీఆర్‌ఎస్ శ్రేణులు ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో నాయకులు రొడ్డ కృష్ణ, వెంకటయ్య, మౌలాలి, గురువయ్య, గోపాల్, ముసలయ్య పాల్గొన్నారు.

## వరికొనుగోలు కేంద్రం పరిశీలన

పాన్‌గల్, నవంబర్ 28: మండలంలోని కేతేపల్లిలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం సీపీఐ జిల్లా నాయకులు పి.కళావతమ్మ సందర్శించారు. ధాన్యంలో తేమను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు, దళారులను ఆశ్రయించి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని కోరారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో రైతులు, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కేతేపల్లిలోని వరి కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు కళావతమ్మ తదితరులు